సొంతింటి కల నెరవేరేదెప్పుడో..

సీతారాంపురంలో అసంపూర్తిగా 25 డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- స్లాబ్ దశలోనే నిలిచిపోయిన పనులు
- త్వరితగతిన పూర్తిచేసి పంపిణీ చేయాలని కోరుతున్న పేదలు



సీతారాంపురంలో స్లాబ్ దశలోనే నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

హుజూర్‌నగర్‌రూరల్ : పేదోడి సొంతింటి కల ఏళ్లుగా కలగానే మిగులుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో పేదలు ఇళ్ల పంపిణీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. హుజూర్‌నగర్ మండలంలోని సీతారాంపురంలో 2017లో 25 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు రూ. కోటి 57 లక్షల 25 వేలతో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం 2018లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. నాలుగేళ్లు గడుస్తున్నా 10 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే 70 శాతం పూర్తయ్యాయి. మరో 15 ఇళ్ల నిర్మాణాలు స్లాబ్ లేవల్‌లోనే ఆగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన నాటి నుంచి ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. అయితే వారికి కాంట్రాక్ట్ గిట్టుబాటు కాకపోవడం, నిధుల కొరతతో నిర్మాణాలను మధ్యలోనే వదిలేసి వెళ్తున్నారు. దీంతో కొన్నేళ్లుగా నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఇళ్లు నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్న పరిస్థితి కూడా నెలకొంది. ఇళ్ల చుట్టూ కంపచెట్లు సైతం కమ్మేశాయి. ఇక ఇళ్ల చుట్టూ ప్రహరీ, మరుగు దొడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వసతులు కల్పించేసరికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందోనని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తిచేయాలి



సీతరాంపురంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి. పనులు చేపట్టి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. అధికారులు చొరవ తీసుకొని వేగంగా పనులు పూర్తిచేయించాలి. అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు పంపిణీ చేయాలి.

– గునగంటి కనకయ్య, సీతారాంపురం

గుడిసెల్లో బతుకుతున్నాం



డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇళ్లు లేక ప్రస్తుతం గుడిసెల్లో బతుకుతున్నాం. గుడిసెల్లో తేళ్లు, పాములు వస్తుండటంతో భయంభయంగా గడుపుతున్నాం. గుడిసెలో నలుగురం ఉండాలంటే ఇబ్బందిగా ఉంది.

– మేకపోతుల పాపయ్య, సీతారాంపురం

బిల్లులు రాక కాంట్రాక్టర్ నిలిపివేశాడు



కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని పనులు నిలిపివేశాడు.గతంలో కాంట్రాక్టర్ పనులు నిదానంగా చేస్తున్నాడని కాంట్రాక్టర్‌ను మార్చాం. ఆ తరువాత వచ్చిన కాంట్రాక్టర్‌కు పనులు చేసిన బిల్లులు రాకపోవడం, బీహార్ కార్మికులు వెళ్లిపోవడంతో అతను కూడా పనులు నిలిపివేశాడు. దీంతో మేం కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపాం. ఈలోగా కాంట్రాక్టర్ నరేష్ అనారోగ్యానికి గురై మృతి చెందడంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– వద్యా శివకుమార్, ఏఈ ఆర్‌అండ్‌బీ, హుజూర్‌నగర్

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మునగాల : రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నడుం బిగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను అరికట్టాలని, రూ.లక్ష లోపు రుణాలు, వడ్డీ వెంటనే మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు, కూలీ సంఘం నాయకులు పోటు లక్ష్మయ్య, ఉదయగిరి, ధరావత్ రవి, అఖిల భారత రైతు, కూలీ సంఘం నాయకులు ధరావత్ సైదా, తమ్మిశెట్టి వెంకన్న, మల్లారెడ్డి, మద్దెల వెంకన్న, అనంత రామయ్య, ప్రతాప్, లచ్చినర్సు, బ్రహ్మం, సైదులు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



కాపుగల్లులో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న చౌటపల్లి రైతులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లికి చెందిన రైతులకు ఆయిల్‌పామ్ తోటల సాగుపై ఉద్యానవన శాఖ సౌజన్యంతో ఓ కంపెనీ వారు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ కోదాడ మండలంలోని కాపుగల్లులో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటలను చౌటపల్లి రైతులకు సందర్శింపజేసి సాగులో మెళకువలు, ప్రభుత్వ సబ్సిడీ, లాభాలు తదితర అంశాలపై వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సాయి, వెంకట్, బాలెబోయిన రవిగౌడ్, చౌటపల్లి రైతులు, మాజీ ఉపసర్పంచ్ తమ్మర శ్రీనివాసరెడ్డి, ఏలూరి వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, భద్రంరాజు వెంకట్రామయ్య, తదితరులు ఉన్నారు.

'ప్రైవేటు' దోపిడీని అరికట్టడంలో విఫలం

హుజూర్‌నగర్ : ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూతు చేయడాన్ని కట్టడి చేయడం తమ ఎజెండాలో లేని అంశంగానే ప్రభుత్వం అధికారులు భావిస్తున్నారని ఆరోపించారు. పేరెంట్స్ సంఘాల ఒత్తిడితో ప్రభుత్వం జీఓ ఇచ్చినా సదరు స్కూల్ యాజమాన్యాలు దానిని చూసినా చూడనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో ఫీజుల నియంత్రణ కోసం 2017లో ప్రొఫెసర్ తిరుపతిరావు అధ్యక్షతన కమిటీ నివేదికను ప్రభుత్వానికి అందించినా ఇప్పటికీ అది రహస్యంగానే ఉంచారని చెప్పారు. ప్రతి పాఠశాలలో ఫీజుల నియంత్రణ కమిటీ వేసి అందులో ఐదుగురు పేరెంట్స్‌ని సభ్యులుగా నియమించాల్సి ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.నర్సింహరావు, ప్రధాన కార్యదర్శి గోవింద్, రామస్వామి, నాయకులు మట్టపల్లి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

5న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక పోటీలు

కోదాడఅర్బన్ : కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు జూలై 5న పోటీలు నిర్వహించనున్నట్లు కోదాడ ఎంఈఓ ఎండీ సలీం షరీఫ్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలలోని ప్రభుత్వ పాఠశాలలలో ఆసక్తి కలిగిన విద్యార్థులను ఈ పోటీలలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నాలుగో తరగతికి ఎంపిక చేయడానికి 2013 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి, మూడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐదవ తరగతిలో ఎంపిక కావడానికి 2012 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి, నాలుగో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంపిక సమయంలో ఆధార్‌కార్డ్ జీరాక్స్, స్టడీ సర్టిఫికెట్ తప్పనిసరిగా చూపించాలన్నారు. వివరాలకు పీఈటీ జి.కొండల్ రావు (9951845824)ను సంప్రదించాలని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక నిర్వహణకు ఐదు మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పీఈటీలకు జూలై 1న కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'గృహలక్ష్మి' అర్హులకు రూ.6 లక్షలు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు కాకుండా రూ.6 లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి స్థలం లేని పేదలకు ప్రభుత్వం స్థలం ఇవ్వాలని కోరారు. హుజూర్‌నగర్ శివారులో గత పది ఏళ్ల క్రితమే సుమారు రూ.100 కోట్లతో 2 వేల గృహాల నిర్మాణం మొదలు పెట్టి అసంపూర్తిగా వదిలి పెట్టారన్నారన్నారు. ఈ విషయంలో రాజకీయ నాయకులు దోబూచులాడుతూ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మేళ్లచెరువులోని ఇందిరమ్మ కాలనీలో 10 ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు అధికారులు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడం లేదని చెప్పారు. బూరుగడ్డ, సీతారాంపురంలలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 3న జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆయన కోరారు కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, నాయకులు బ్రహ్మం, సైదులు, హుస్సేన్, యోనా, వెంకటేశ్వర్లు, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగ

మోతె : మండల పరిధిలోని తుమ్మగూడెం గ్రా మంలో గల కొడకండ్ల వారి వీధిలో 47వ విద్యుత్ తీగ తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు తెగుతుందోనని ఆ వీధి ప్రజలు భ యాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగను తొలగించి నూతన తీగను అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెదవీడులో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్

మఠంపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య శుక్రవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. పెదవీడు, చౌటపల్లి, బక్కమంతుల గూడెం గ్రామాలకు చెందిన సాయమ్మకి రూ.60 వేలు, నరసమ్మకి రూ.12వేలు, వెంకటేశ్వర్లుకి రూ.39 వేలు, కనకయ్యకి రూ.26వేలు, శంభయ్యకి రూ. 22వేలు, సైదిరెడ్డికి రూ.24వేలు, సుబ్బయ్యకి రూ.50వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సయ్యద్‌బీబీకుతుబ్, కృష్ణవేణినరేష్, విజయకుమారివెంకటరెడ్డి, ఎంపీటీసీలు నాగిరెడ్డి, వెంకటరెడ్డి, ఉపసర్పంచ్‌లు ఆదిలక్ష్మి, బ్రహ్మం, గ్రామస్తులు ఉన్నారు.

బధిరుల పాఠశాలకు సరుకుల అందజేత



విద్యార్థులకు సరుకులు అందజేస్తున్న రావులపల్లి మోహన్‌కుమార్- దీపిక దంపతులు

నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన రావులపల్లి ప్రసాద్‌రావు కుమారుడు రావులపల్లి మోహన్‌కుమార్–దీపికల వివాహ మహోత్సవం సందర్భంగా నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మిర్యాలగూడ మండలం అవంతీపురం బధిరుల పాఠశాలకు రూ.50 వేల విలువైన పోషక విలువలు కలిగిన నిత్యావసర సరుకులను నేరేడుచర్లలో అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.సీతారామారావు, కందిబండ శ్రీనివాస్‌రావు, రామస్వామి, రామకృష్ణ, విశ్వనాథ్, నర్సింహారావు, సుగుణ, తులసీరాం, నంద, స్వప్న, సునీత ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని బూరుగడ్డలో కాంపాటి సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం అతని దశదిన కర్మ సందర్భంగా బాధిత కుటుంబానికి సర్పంచ్ షేక్ సలీమారంజాన్ 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు షేక్ అలీపాషా, ఆవుల వెంకటయ్య, మిన్నయ్య, నర్సింహారావు, శ్రీను, మధు, కిషోర్ ఉన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, దుస్తులు..

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం వనపర్తి సేవాదళం ట్రస్టు సభ్యుడు కొక్కు వినయ్‌వర్మ తన తండ్రి కొక్కు వెంకటేశ్వర్లు తృతీయ వర్ధంతి సందర్భంగా దుస్తులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వనపర్తి లక్ష్మీనారాయణ, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, బీసీ సంఘం నాయకులు శివ, వినయ్‌వర్మ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే చేపట్టాలి

మునగాల : తెలంగాణలో పోలీసు ఉద్యోగ నియామకాలను పాత పద్ధతిలోనే నియమించాలని, ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీఓ నెం.46ను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మండవ చంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నిరుద్యోగులు కష్టపడి అర్హత సాధించిన తర్వాత ఫలితాలు విడుదల చేసేముందు జిల్లాల వారీగా పర్సంటేజ్ ప్రకారం ఎంపిక ఉంటుందనడం ఎంతవరకు సమంజసమన్నారు. మెరిట్ ప్రకారం ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని లేనియెడల నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు.

స్వాగత ద్వారం ప్రారంభం

కోదాడఅర్బన్ : ఐఎన్‌టీయూసీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వాడపల్లి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం పట్టణంలోని వర్తక సంఘం బజార్ వాడపల్లి వీధిలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాన్ని వారి కుటుంబసభ్యులు వాడపల్లి రంగమ్మ, వాడపల్లి స్టాలిన్‌లు శుక్రవారం ప్రారంభించారు. గట్ల బ్రదర్స్, పి.వెంకటనారాయణ, పార్టీల నాయకులు నయీం, మాజీ వైస్ ఎంపీపీ పాండు, గౌతమ్, బాబు, ముత్యాలు, వెంకటేశ్వర్లు, సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రూప్-4 అభ్యర్థుల కోసం నేడు ప్రత్యేక బస్సులు

కోదాడఅర్బన్ : రాష్ట్రంలో శనివారం గ్రూప్- 4 పరీక్ష ఉన్నందున అభ్యర్థుల కోసం శనివారం కోదాడ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడ నుంచి సూర్యాపేట, మిర్యాలగూడ, ఖమ్మం, హైదరాబాద్‌కు బస్సుల సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 5 గంటల నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు బస్సులు నడుపుతామన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్ డెస్క్ నంబర్ 9959226302ను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

మేళ్లచెరువు : మండలంలోని కందిబండ, హేమ్లాతండా గ్రామ పంచాయతీల పరిధిలో ఇళ్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దామోదర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని 336 సర్వే నంబర్‌లో 166 ప్లాట్లు, కందిబండలో సర్వే నంబర్ 5, 6 భూమిలో 100 ప్లాట్లకు సంబంధించి ఈనెల 6 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలి పారు. దరఖాస్తుదారులు ఆయా పంచాయతీల్లో ఓటరుగా ఉండి, నిరుపేద అయి ఉండాలని తెలిపారు.

భవిత కేంద్రానికి దాతల సహకారం అభినందనీయం

హుజూర్‌నగర్ : భవిత కేంద్రానికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని భవిత దివ్యాంగుల కేంద్రానికి మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ రూ.10 వేలు, ఇనుగుర్తి షణ్ముఖాచారి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఇనుగుర్తి వీణ అనీల్‌లు రూ.20 వేలతో రంగులు వేయించారు. దీంతో శుక్రవారం దాతలను శాలువతో సన్మానించారు. అనంతరం కేంద్రంలోని చిన్నారులకు ఫిజియోథెరపిస్టు మీరా నోట్ పుస్తకాలు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఇనుగుర్తి అనీల్, హెచ్‌ఎంలు రాధాదుర్గ, యతిపతిరావు, ఐఈఆర్‌పీ శ్రీనివాస్, సీఆర్‌పీ సైదులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ గ్రామ అధ్యక్షుడు మృతి



బీమన సైదులు (ఫైల్)

పాలకవీడు : గుండెపోటుతో బీజేపీ సజ్జాపురం గ్రామ అధ్యక్షుడు మృతి చెందిన సంఘటన పాలకవీడు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సజ్జాపురం గ్రామానికి చెందిన బీమన సైదులు(40) పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి ఓ దుకాణం వద్ద గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గమించిన స్థానికులు సీపీఆర్ చేశారు. కానీ అప్పటికే సైదులు మృతి చెందాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద చనిపోవడంతో కుంటుంబ సభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. సైదులు ప్రస్తుతం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నాడు. సైదులు మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్రామ అభివృద్ధికి కృషిచేస్తా



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగమణి

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ మమిడి నాగమణి చినరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. పనులు నాణ్యవంతంగా సకాలంలో పూర్తిచేయాలని కోరారు. ఎంపీటీసీ గువ్వల జయమ్మనాగేశ్వరరావు, ఉప సర్పంచ్ జిక్కల నాగమణి సైదులు, కన్నెకంటి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సౌమ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఓజో ఫౌండేషన్

మఠంపల్లి : నియోజకవర్గంలోని గిరిజనులకు ఓజో ఫౌండేషన్ అండగా నిలుస్తోందని ఆ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న అన్నారు. మండలంలోని రామచంద్రాపురంతండాలో అనారోగ్యంతో మృతిచెందిన ఆంగోతు కమిలి కుటుంబానికి శుక్రవారం పిలుట్ల రఘు అన్న చేయూత ద్వారా రూ.5వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ సభ్యులు రవినాయక్, రాజునాయక్, బాబునాయక్, శివశంకర్, సుధాకర్, అంజయ్య, హరియానాయక్, రమేష్, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల లావాదేవీలు నిలిపివేయడం తగదు

నడిగూడెం : రైతుల లావాదేవీలను బ్యాంకర్లు నిలిపివేయడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులలో జమ అయిన రైతు బంధు నగదును రైతులకు ఇవ్వకుండా బ్యాంకర్లు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి బ్యాంకర్లు రైతులను ఇబ్బందిపెటకుండా చూడాలని కోరారు.

గ్రూప్- 4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



హుజూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో 7 కేంద్రాలలో గ్రూప్- 4 పరీక్ష నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆయా కేంద్రాలలో అధికారులు పరీక్ష నిర్వహణపై ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఒక పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండవ పేపర్ పరీక్ష రాయాల్సి ఉంది. ఉదయం 9.45 కే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆ తర్వాత వస్తే అనుమతించమని అధికారులు తెలిపారు. పట్టణంలోని 7 కేంద్రాలలో మొత్తం 2,136 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. చైతన్య హైస్కూల్‌లో 312 మంది, ప్రియదర్శిని డిగ్రీ కాలేజీలో 360 మంది, ప్రియదర్శిని జూనియర్ కాలేజీలో 336 మంది, సిద్ధూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 240 మంది, ఎండీఆర్ హైస్కూల్‌లో 240 మంది, గ్రీన్ ఉడ్ స్కూల్లో 408 మంది, వీవీఎం హైస్కూల్లో 240 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

కోదాడఅర్బన్ : తెలంగాణ ప్రభుత్వం శనివారం నిర్వహిస్తున్న గ్రూప్–4 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కోదాడ తహసీల్దార్ జనమంచి శ్రీనివాసశర్మ శుక్రవారం తెలిపారు. పట్టణంలో 23 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని యజమానులను ఆదేశించారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు సమయానికి రావాలని, ఆలస్యంగా వస్తే అనుమతి ఉండదని చెప్పారు.

చిలుకూరు : శనివారం గ్రూప్–4 పరీక్ష నిర్వహణకు మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాలలో 240 మంది, చిలుకూరు గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 288, మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 840 మంది, రామాపురం గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో 480 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్షా కేంద్రం వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో గ్రూప్- 4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జి.కార్తీక్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో 336 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు.

'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయాలి

నడిగూడెం : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని తెల్లబెల్లి గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సోంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు నెమ్మాది సురేష్, నెమ్మాది మేరి, చిట్టెమ్మ, సుజాత, ప్రమీల, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం



మఠంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మఠంపల్లి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 9ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం ఆవాస్ యోజన, ఫసల్ బీమా, మహిళా రుణాలు తదితర పథకాల గురించి ప్రజలకు వివరించామన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, రాఘవేంద్ర, రంగానాయక్, అమరయ్య, వీరారెడ్డి, మురళీధర్, పుల్లయ్య, బాలు, సైదా, తులసీరామ్, రాజు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి కేంద్ర పథకాలు అందాలి

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని శ్రీనివాసపురంలో నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 సంవత్సరాల సుపరిపాలనలో భాగంగా మేరే బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, శౌరిగౌడ్, వీరబాబు, సైదులు, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం



మునగాల : తాడువాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేష్

మునగాల : రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ పి.లోకేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాడువాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు పౌర హక్కులపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. గ్రామస్తులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఆర్ఐ సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్, వీఆర్ఏలు గట్టు ఉపేందర్‌రావు, మాచర్ల ఆదిత్య, సైదులు, నాయకులు కోట వెంకటేశ్వర్లు, గోపి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం

పాలకవీడు : అర్హులైన దళితులందరికీ దళితబంధు, గృహలక్ష్మి పథకాలు వర్తింపజేయాలని ఎంపీటీసీ ఉపేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బెట్టెగూడెం ఎస్సీ కాలనీలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎస్సై లింగయ్య మాట్లాడుతూ కుల, వర్గ బేదాలతో వివక్ష చూపితే తమకు తెలియజేయాలన్నారు. తదనంతరం పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష రుణమాఫీని ఒకేసారి చేయాలి



మాట్లాడుతున్న శ్రీరాములు

మునగాల: ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 3వ తేదీన ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు కోరారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని అమరవీరుల స్మారకభవనంలో ప్రజాసంఘాల పోరాట వేదిక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని, రూ.లక్షలోపు రుణాలను ఒకేసారి మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి స్టాలిన్‌రెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ బచ్చలకూరి స్వరాజ్యం, మహిళాసంఘం నాయకురాలు జ్యోతి, అనంతు గుర్వయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు లింగయ్య పాల్గొన్నారు.